# ప్రేమ లేఖలు

ఏవో కాలేజీకి వరసగా సెలవలు ఇచ్చారు. సెలవలు వస్తున్నాయంటే ఎంత సరదా వచ్చినా, సెలవల్లో కాలం గడపడానికి విద్యార్థులు అష్ట కష్టాలూ పడుతూంటారు.

ఎంతమంది ఇళ్ళకి వెళ్ళినా, ఎన్ని పుస్తకాలు చదివినా, సెలవలు పూర్తయ్యేసరికి కొన్ని యుగాలు గడిచినట్టు వుంటుంది.

నాకు కొత్తగా తోచేది కాదు. అమ్మా, నాన్నా పక్కింటి వెంకాయమ్మను గురించి, మూడో యింటి సుబ్బాయమ్మను గురించి ఏదో వాద వేసుకుంటూ వుండేవారు. అలాంటి సంభాషణల్లో పాల్గొనటం నాకిష్టం లేదు. చిన్న చెల్లెలుతో ఆడుకుంటూ వుండే దాన్ని.

ఆ రోజు శనివారం. పెందరాళే స్నానంచేసి వరండాలో కూర్చున్నాను. చల్లటి గాలి వీస్తోంది. నా మనస్సులో కాలేజీలో జరిగిన సంఘటనలు తిరుగుతున్నాయి. మా క్లాసులో వాళ్ళందరూ నన్ను ''పెంకిపిల్ల!'' అని పిలిచేవారు. మొగవాళ్ళ జోలికి పోకపోయినా, ఆడవాళ్ళని మాత్రం ఎప్పుడూ ఏవో అల్లరి పనులుచేసి ఏడిపిస్తూ వుండేదాన్ని. ఎన్నోసార్లు నామీద, లెక్చరర్లవద్దకు ఫిర్యాదులు కూడా వెళ్ళాయి. కాని ఎంత అల్లరి చేసినా నాకు సాధారణంగా ఫస్టు మార్కులు వస్తూ వుండేవి. దానివలన లెక్చరర్స్ కాస్త మందలించి వూరుకునేవారు.



(1) చైనా సర్కస్ దృశ్యం.

ప్రత్యేకంగా నాతో చదివే చంద్రావతి సులువుగా వుడుక్కుపోయేది. దానిని ఏడిపించడం అంటే నాకెంతో హుషారుగా వుండేది. చంద్రావతి మామూలంగా ఎంత ఏడ్చినా చివరికి నాతో స్నేహంగానే వుండేది.

ఇలా ఎన్నో మధుర సంఘటనలు తల్చుకుంటూ, శారీరకంగా ఇంట్లోవున్నా, మానసికంగా కాలేజీలో విహరిస్తున్నాను. పక్కని హఠాత్తుగా మ్రోగిన పోస్టు వాడి సైకిలు బెల్లు విని వులిక్కి పడ్డాను. పోస్టుమన్ ఒక కవరు నాచేతి కందించి వెళ్ళిపోయాడు. ఆ కవరు నాకే! అది నాకు ఎవరు రాసి వుంటారా అని ఆశ్చర్య పోయాను. ఆ కవరుని పరీక్షిస్తూ వుండిపోయాను. నీలం కవరు. దానిమీద నా పేరు చెక్కినట్టు రాయబడింది. ఆశ్చర్యంతో కవరు చింపి వుత్తరం బయటకు లాగాను. అది చదువుతూ నిర్ఘాంతపోయాను. ఆ వుత్తరంలో ఇలా వుంది:

''ప్రియమైన లలితకి,

''నిన్న సాయంత్రం నీకోసం రాత్రి పది దాకా బీచ్‌లో కాచుకుకూర్చున్నాను. వస్తానని కూడా నువ్వు ఎందువల్లో రాలేదు. ఆశ్చర్యంగా వుంది. మనం మళ్ళా కలుసుకోవాలి. వెంటనే నాకు జవాబు రాయి.

శ్రీమతి

ఎ. భాస్కరమ్మ

''లల్లీ! ఆనాడు మనిద్దరం బీచ్‌లో ఇసుకలో పక్క పక్కనే పడుకుని ఆకాశంలో వెలుగుతున్న చందమామని వెక్కిరించిన సంఘటన జ్ఞాపక ముందా? ఆ రాత్రంతా అలాగే పడుకుని, ప్రొద్దుటే సూర్యోదయం చూసిపోదా మన్నావ్!

''లల్లీ! ఈ వుత్తరానికి తక్షణం జవాబు పంపు. నువ్వు ఎక్కడకి రమ్మన్నా రెక్కలు కట్టుకుని ఎగిరొచ్చి నీ ముందు వడతాను.

నీ ప్రియుడు.''

ఆ వుత్తరం చదువుతూంటే అదో విధమైన భయం నన్ను ఆవరించింది. చేతులు వణుకుతున్నాయి. బాధ పడుతున్నాను, ఏడుస్తున్నాను. ఆ వుత్తరం నేను చదవడం ఎవరేనా చూశారేమో అని ఓసారి నలువైపులా చూశాను. పెద్ద లెవరూ లేరు. కాని చిన్న చెల్లెలు మాత్రం నా దగ్గరకి వస్తోంది.

''ఎందు కక్కా, ఏడుస్తున్నావ్?'' అందది.

కంట్లో నలక పడిందని దానితో చెప్పి, వంటింట్లో అమ్మ ఏం చేస్తోందో చూసిరమ్మని దాన్ని పంపేశాను మెల్లిగా నా గదిలోకి వెళ్ళాను. పదే పదే ఆ వుత్తరం చదువుకున్నాను. చదివినకొద్దీ నాలోంచి కోపం పుట్టుకొస్తోంది. నా హృదయంలో ఏదో మండుతోంది. ఆ సమయంలో ''నా ప్రియుడు'' నా ముందుంటే అతన్ని పీక పిసికి చంపేసి వుండేదాన్నేమో!

ఇంతలో అమ్మ "లలితా! లలితా!" అంటూ తలుపు తట్టింది.

ఏం చెయ్యడానికీ తోచక ఉత్తరం పరుపుకింద దాచి తలుపు తీశాను. మా అమ్మ గబగబా లోపలికి వచ్చి, "ఏం చేస్తున్నావే? ఎంతసేపు పిలిచినా పలకవేం? చాకలిది వచ్చింది. బట్టల పద్దు చూడు" అందామె.

"అలాగే చూస్తాలే" అన్నాను. కాని నా మనస్సంతా పరుపుకింద దాచిన ఉత్తరంమీదే వుంది.

మొహం కడుక్కుందామని స్నానాల గదిలోకి వెళ్ళాను. మళ్ళా నా గదిలోకి తిరిగి వచ్చాను. నిర్ఘాంతపోతూ నిలబడ్డాను. అమ్మ నా పరుపునుచుట్టి మాసిపోయిన దుప్పటిని నేలమీద పడేసింది. దానితో కింద పడ్డ నీలం కవరు వైపు అనుమానంగా అమ్మ చూస్తోంది. ఒక్క గెంతేసి దాన్ని అమ్మ చేతుల్లోంచి లాక్కుందా మనుకున్నాను. కాని ధైర్యం లేకపోయింది.

"ఏమిటే యిది?" అంటూ అమ్మ ఉత్తరం చదవసాగింది.

నా గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఒళ్ళంతా చెమటలు పోశాయి.

"బాగానే వుంది నీ కాలేజీ చదువు! ఇదన్నమాట!" అంటూ కళ్ళెఱ్ఱజేసి కోపంతో చరచరా అమ్మ...ఉత్తరంతోసహా బయటకు వెళ్ళిపోయింది. కాస్సేపట్లో పక్క గదిలోంచి అమ్మ, బామ్మ మాటలు నాకు వినపడ్డాయి.

"అత్తయ్యా! చూసేరా! లలిత చేసే పనులు! దాని ప్రియుడు దగ్గిరనుంచి ఉత్తరాలు కూడా వస్తున్నాయి. ఈ కాలేజీ చదువు లెందుకు, శుభ్రంగా ఒక మంచి సంబంధం చూసి పెళ్ళి చేయండి, అంటే మీ అబ్బాయి విన్నారా! మాయ చదువులు! ఎంత చదువుకున్నా.....వండార్చిందే కదా!" అంది అమ్మ. బామ్మ ఏదో చెబుతోంది.

నేను పక్కమీద పడుకుని ఏడుస్తున్నాను. ఎంత వినకూడదనుకున్నా వాళ్ళమాటలు వినిపిస్తూనే వున్నాయి.

తన పేరు రాయడానికి కూడా ధైర్యంలేని ఈ ప్రియుడు ఎవరు? అదే ఆలోచన నన్ను వేధించింది. నా బుర్ర వేడెక్కుతోంది. ఎంతసేపు అలా పడుకుని వుండి పోయానో నాకే తెలియదు.

సాయంకాలమయింది. మా నాన్నగారు ఆఫీసునుంచి వచ్చేవేళయింది. నాన్నగారు వచ్చేక జరగబోయే గొడవని వూహిస్తున్నాను. గుమ్మందగ్గిర జోళ్ళ చప్పుడు వినిపించింది. మా నాన్నగారు వచ్చారు. ఆయనకు నేనంటే చాలా ఇష్టం. ఆఫీసునుంచి రాగానే నన్ను పలకరించకుండా లోపలికి వెళ్ళరు. ఆయన చాలా సంతోషంగా లోపలికి వచ్చి, చటుక్కున నేను పడుకుని వుండడం చూసి జాలిగా:


"ఏవమ్మా, లలితా, జ్వరం వచ్చిందా?" అంటూ నా దగ్గరకు వచ్చారు. నాకు ఏం చెప్పాలో తెలియక ఏడ్చాను. ఆయన తల నిమురుతూ, "ఫరవాలేదమ్మా తగ్గిపోతుంది" అన్నారు. అసలు విషయం తెలిశాక కాస్సేపట్లో ఆయనలో కలగబోయే మార్పునుగురించి ఆలోచిస్తూంటే ఒళ్ళు జలదరించింది. పది నిముషాలు ఆయన ఆ కబుర్లూ, ఈ కబుర్లూ చెప్పి లోపలికి వెళ్ళారు.

కాస్సేపట్లో "ఏమిటే! దానికి జ్వరం వచ్చినట్టు వుంది. డాక్టరుని పిలవలేకపోయావా? మీ పుక్కిటి పురాణ మేదో మీది. ప్రపంచం ఏమవుతున్నా మీకే మీ అక్కరలేదు" అని గట్టిగా అంటున్న మాటలు నా చెవులు చిల్లులు పడేటట్టు వినబడ్డాయి. తప్పు చేయకపోయినా నా ఒళ్ళు గజగజ లాడింది. "ఇది ఎవరింటి పుక్కిటి పురాణమో కాదు, మీ ఇంటిదే. మీ అమ్మాయి అఘోరించినదే. మేము చెప్తే విన్నారుకాదు. ఇప్పుడు చేతులు కాలేక ఆకులు పట్టుకుని ఏం లాభం?" అంది బామ్మ ఈసడింపుగా. పది నిముషాలలో ఇంట్లో ఎంత గొడవ జరగాలో అంతా జరిగింది. ఆ రాత్రంతా మా అమ్మ నన్ను చదువుమానిపించెయ్యాలనీ, తొందరగా పెళ్ళి చేసెయ్యాలనీ, లేకపోతే నా వికారపు చేష్టలకు పట్టపగ్గా లుండవనీ చాలా హంగామా చేసింది.

రెండు మూడు రోజులు గడిచాయి. ఆ విషయం కొంచెం పాతబడింది. ఇంట్లో, దానిమీద చర్చలు తగ్గాయి. కాని నేను ఏదో తప్పు పని చేసినట్టు నన్ను కొంచెం హీనంగా చూడడం మొదలుపెట్టారు. నేను పూర్తిగా మౌనం దాల్చాను.

మధ్యాహ్నమయింది. అమ్మా, బామ్మా వంటింట్లో అప్పడాలు వత్తుకుంటున్నారు. పోస్టు వచ్చే టైము అయింది. నేను అప్రయత్నంగా అదేచోట వరండాలో కూర్చున్నాను. కొంతసేపటిలో గేటుతీసిన కిర్రు చప్పుడుకి వులికిపడ్డాను. అనుకున్నట్టే పోస్టుమన్ వచ్చాడు. వాడు దగ్గరకి వస్తున్నకొద్దీ గుండె వేగంగా కొట్టుకో సాగింది. మళ్ళా అతడు ఒక నీలం కవరు ఇచ్చి వెళ్ళిపోయాడు. ఇంక నా భయానికి అంతులేదు. కవరు తొందరగా చింపాను. లోపలున్న ప్రేమలేఖని చదివాను. ఈ ఉత్తరం ద్వారా నా ప్రియుడు పేరు చంద్రకాంత్ అని తెలుసుకున్నాను.

(మిగతా 60 వ పేజీలో)



(2) చైనా పర్యాన్ దృశ్యం.

కోడిని కోసి వండిపెట్టి ఏదో తారుమారు చేయా అనుకొన్నది నల్లక్క అనుకొన్నాడు.

“ఇంకే చెప్పు ఏమిటి చేయాల్నా?” అంటూ గద్దించాడు.

“ఉండండిఅయ్యగారూ! ఐదు నిమిషాల్లో ఉంగరం విషయం తేల్చేస్తాను.” అంటూ కొక్కొరిస్తూ దగ్గరికి వచ్చిన కోడిపుంజును పట్టుకొన్నది నల్లక్క.

కోడిపుంజు మెడ క్రింద వున్న తొండను పిసికి “ఉంది....ఉంది” అంటూ ఇల్లెగిరిపోయేలా అరిచింది నల్లక్క. సబ్ ఇన్‌స్పెక్టర్ స్తబ్ధుడై రెండు మూడు క్షణాలు తేరుకొని “ఎక్కడుంది?” అంటూ దగ్గరకు వచ్చాడు.

“ఇదో పట్టిచూడండి. వేలికి తగులుతుందంటూ కోడిని అందివ్వబోతే మిస్టర్ ఘనే “మూడవోయ్ ఏమిటీ నాన్సెన్స్!” అంటూ టూ ఒన్ టూ వంక చూశాడు. అతడు కోడిపుంజు నందుకొని తొండను తడిమి చూచి “ఉంది కెండీ” అన్నాడు.

మిస్టర్ ఘనే వస్తుతేజ కుర్చీలో వెనగిలబడి పై కప్పును చూస్తూ—

“మిస్టర్ రెడ్డిగారూ! మీరు చెప్పండి. ఆ కోడి గొంతులో ఉంగరం ఉందా?” అన్నాడు.

కొండారెడ్డిగారు కోడి నందుకొని తొండంపట్టి తడిమి “అరే ఉందే” అంటూ కిసుక్కున నవ్వాడు.

“వండర్! వండర్! మార్వెలస్. మై డియర్ నల్లక్కా, డిటెక్టివ్ నల్లక్కా! ఏది ఉంగరాన్ని చూపిస్తావా?” అంటూ పైకి లేచి అన్నాడు మిస్టర్ ఘనే.

చిటికెలో కోడిని ఖూనీ చేసింది నల్లక్క—గొంతు క్రింది తొండను బయటికి తీసి బాకుతో రెండు బద్దలు చేసింది. అద్భుతం! అపూర్వం! అమోఘం! ఆశ్చర్యం! ఎగిరి గంతేశాడు సబ్ ఇన్‌స్పెక్టర్ మిస్టర్ జె. డి. ఘనే. “ఓహోహో! వాట్ ఎ ట్రెమెండస్ ఇన్వెస్టిగేషన్! సస్పెన్స్! సస్పెన్స్! ఎవ్విరి మూవ్‌మెంట్ విత్ సస్పెన్స్...ఓ డిటెక్టివ్ నల్లక్కా! నీ సాటి రాగల డిటెక్టివ్‌లు ఈ జగత్తులో లేరు. కేవలం ఒకే కోడిని ఖూనీచేసినా అది తప్పుకాదు. చట్టం అనుమతిస్తుంది. నీ అద్భుత పరిశోధనా శక్తి ఎవరికుంది? నీ అఖండ మేధా సంపన్నత ఏ డిటెక్టివ్‌కు ఉండి ఏడ్చింది? ఆహా! కనీసం ఒక్క చుక్క పెట్రోలు నష్టం లేకనే, ఒక సిగరెట్టునైనా కాల్చకనే, ఒక్క ఫర్లాంగైనా నడవకనే, ఏ శిథిల గృహమూ పరిశీలించకనే, కనీసం కాలు కదపకనే ఉన్న చోటనే ఉండి దొంగను కనిపెట్టావు. ట్రెమెండస్........ ట్రెమెండస్! నీ పరిశోధన చరిత్రలోనే అపూర్వం. ఈ ఒక్క ఇన్సిడెంటు చాలు, నీ ఖ్యాతి ఖండ ఖండాలు వ్యాపించడానికి.

“ఓ మై డియర్ నల్లక్కా, ఓహో డిటెక్టివ్ నల్లక్కా నీకు నా హార్దిక కంగ్రాచ్యులేషన్స్. నీ కీర్తి ఘన భూనభోంతరాళాలు వ్యాపించుగాక!

“ఎలా తెలుసుకున్నావ్? ఏ విధంగా వూహించావ్!” అరగంట అనర్గళంగా ఉపన్యసించాడు మిస్టర్ జె. డి. ఘనే. నల్లక్క అలాగే స్తబ్ధురాలై నిలబడిపోయింది. ఉపన్యాసం ముగిశాక “అదేం మాటలు అయ్యగారూ! ఒకటీ అర్థంకావు” అంటూ గుప్పెడు పొగాకు దుగ్గు తీసి పుక్కిట కెక్కించింది.

మిస్టర్ ఘనే మరొక సిగరెట్టు ముట్టించి “మిస్టర్ చిక్కడూ ఐయాం వెరీ సారీ ఎక్స్క్యూజమి” ఇంక వెళ్ళవచ్చు” అన్నాడు.

కొండారెడ్డిగారు ముద్దుటుంగరాన్ని వ్రేలికి తగిలించుకున్నాడు. మిస్టర్ ఘనే సెలవు తీసుకొని తన ద్విచక్ర శకటాన్ని అధిరోహించాడు. డిటెక్టివ్ నల్లక్క సబ్‌ఇన్‌స్పెక్టర్ అమాయకత్వానికి మెల్లగా నవ్వుతూ వంటగదిలోకి వెళ్ళిపోయింది. ★

# ప్రేమ లేఖలు

(5 వ పేజీ తరువాయి)

కాని చంద్రకాంత్ అడ్రస్ తెలియజెయ్యలేదు. బహుశా మరో ఉత్తరంలో తెలియజేస్తాడేమో అనుకున్నాను. ఈ ఉత్తరాన్ని ఎక్కడేనా దాచడం ప్రమాదకరమని గుర్తించి, చింపివేయా లనుకున్నాను. కాని చింప బుద్ధి కాలేదు. దాన్ని జాగ్రత్తగా నా పెట్టెలో దాచి తాళం వేశాను.

మరునాడు ఆదివారం. ఆ రోజు పోస్టుమన్ రాలేదు. మనస్సు కొంచెం సంతోషించింది. కాని ఇంట్లో నా పెళ్ళి విషయం గురించి విపరీతంగా చర్చలు జరుగుతున్నాయి. నన్ను చదువు మానిపించడానికి మా నాన్నగారు ఒప్పుకున్నారు. సంబంధాలు ఒకదానిమీద ఒకటి చూస్తున్నారు. ఆఖరికి నన్ను మా మేనత్తకొడుక్కి ఇవ్వడానికి నిశ్చయించుకున్నారు. అబ్బాయి స్కూల్ ఫైనల్ ప్యాసయ్యాడట. చదువుకంటె ముఖ్యంగా అతనికి మంచి ఆస్తి వుంది. అతను వచ్చి నన్ను చూసి వెళ్ళాడు. మొదట్లో నాన్నకి ఆ సంబంధం అంటే యిష్టం లేదు. కాని చివరికి ఒప్పుకోవలసివచ్చింది.

నెల తిరిగేలోగా పెళ్ళి చేయడానికి నిశ్చయమైంది. దసరా సెలవులు ముగిశాయి. ఆ రోజు అమ్మ ఎంత వద్దన్నా తెగించి కాలేజీకి వెళ్ళాను. మునుపటి ఉత్సాహం నాలో లేదు. ఇష్టం లేని పెళ్ళితోనూ, మనోబాధతోనూ నీరసించిపోయాను.

నా పెళ్ళి విషయం నా కంటే ముందే కాలేజీలోని వాళ్ళందరికీ తెలిసిపోయింది. చదువు సంధ్యా లేని మేనత్త కొడుక్కి బలయిపోతున్న నన్ను చూసి అందరూ లోలోపల విచారించేవారు. నా స్నేహితురాళ్ళు పెళ్ళికొడుకుని గురించి ఏవో ప్రశ్నలు అడిగేవారు. నేను మౌనంగా వుండిపోయేదాన్ని. క్లాసులో వున్నా నన్నమాటే గాని నా మనస్సంతా నా భావి జీవితాన్ని గురించే బాధ పడుతోంది.

సాయంకాలం ఇంటికి వెళ్తూ కమలని తన కెమిస్ట్రీ నోట్‌బుక్ అడిగాను. తను పూర్తిగా నోట్సు రాసుకోలేదట. అందువల్ల తనవద్ద నున్న చంద్రావతి నోటుబుక్ నా కిచ్చింది.

అది తీసుకుని నేను తిన్నగా యింటికి వెళ్ళిపోయాను.

సాయంకాలం టిఫిన్ తీసుకుని టేబులు ముందు కూర్చున్నాను నోట్సు వ్రాసుకుందామని. చంద్రావతి పుస్తకం తెరిచాను. చంద్రావతి దస్తూరీ చూస్తూంటే నా కేదో జ్ఞాపక మొచ్చింది. చటుక్కున నా పెట్టె వద్దకు పరుగెత్తాను. ఆ రెండో ఉత్తరం బైటకు లాగాను. ఆ పుస్తకంలోవున్న అక్షరాలతో పోల్చి చూశాను. ఆశ్చర్యపోతూ నిలబడ్డాను. ఒక మూల నుంచి కోపం, మరో మూలనుంచి ఆనందం పొంగుకొచ్చాయి. ఉత్తరం, నోట్‌బుక్ పట్టుకుని సమీపంలోవున్న చంద్రావతి ఇంటివైపు పరుగెత్తాను.

“ఎక్కడికే అలా పరుగెత్తుతున్నావ్?” అంటూ మా అమ్మ ఎదురయింది. నేను వినిపించుకోలేదు. చంద్రావతి ముందు వాటిని పడేశాను. ఆమె ఆశ్చర్యాన్ని నటిస్తూ నా వేపు చూసింది.

“అయితే కనిపెట్టేశా వన్నమాట!” అంది నవ్వుతూ. ఇదెంత నాలాటి తెలివైన దానికి అన్నట్టు ఆమెవైపు చూశాను.

“పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణ సంకటం అంటారు. ఈ పిచ్చి ఉత్తరాలు రాసి దసరా సెలవుల్లో నాకు శాంతిలేకుండా చేశావ్! నేను ఎంత బాధ పడ్డానో ఆ భగవంతుడికే తెలుసు” అన్నాను కొంచెం కోపం తెచ్చుకుంటూ.

“మరి, నువ్వు మమ్మల్ని ఏడిపించినప్పుడో!” అంది కసి తీర్చుకుంటున్నట్టు.

“నీ పగ తీరిందిగా! నాతో వచ్చి నువ్వు చేసిన ఘన కార్యాన్ని గురించి మా వాళ్ళతో చెప్పు” అన్నాను.

అలాగే అంది. ఇద్దరం మా ఇంటివైపు వెళ్ళిపోయాం. ★

## కదలని అత్త

ఒక ఆసామితో మిత్రు డిలా అన్నాడు:

“ఈ గోడ గడియారం పెద్ద తాతయ్య గడియారంలా వుందే.”

“మేము మాత్రం అత్తయ్య గడియారమనే పిలుస్తాం. ఎందుకంటారా? అది యేళ్ళ తరబడిని యిక్కడే వుంది. పోదు.”